# మలిముద్రణ

కమలాకరం రచయిత.

అతని కథలు చాలా ప్రచురింపబడ్డాయి. రెండు నవలలు ఓ వారపత్రికలో ప్రచురింపబడిన తర్వాత రచయితగా అతనికి గుర్తింపు వచ్చింది పాఠకుల్లో.

ఆ రెండు నవలలని "కుముదినీ పబ్లికేషన్స్" ప్రచురించింది పుస్తక రూపంలో.

రెండుంపావలా కోర్టుఫీస్టాంపులున్న దస్తావేజు పేపర్ మీద అగ్రిమెంట్ టైప్ చేసి పంపారు సంతకం పెట్టి పంపమని.

మొదటి మూడు సంవత్సరాలకీ, మొదటి అయిదు వేల కాపీలకి రాయల్టీగా అయిదువందల రూపాయలు పంపుతామనీ వ్రాయబడివుంది. ఆ నవల మలిముద్రణకి వెళ్తే మళ్ళీ అయిదు వందల రూపాయలు ఇవ్వాల్సి వుంటుంది, కమలాకరానికి ఆ అగ్రిమెంట్ ప్రకారం.

కార్బన్ కాపీని తన దగ్గరుంచుకుని సంతకం పెట్టి పంపాడు అగ్రిమెంట్ కమలాకరం.

ఇది జరిగింది చాలాకాలం క్రితం.

కమలాకరం పనిచేసే ఆఫీస్‌లో, కొత్తగా వుద్యోగస్థుల కోసం, చిన్న లైబ్రరీని ఏర్పాటు చేసుకోడానికి గ్రాంట్ లభించటంతో ఎక్కౌంటెంట్, సేల్స్ ఇంజనీర్ పుస్తకాలషాప్‌కి వెళ్ళి కొన్ని పుస్తకాలు కొని తెచ్చారు.

వాటిలో కమలాకరం నవల "పాప పరిహారం" కూడా వుంది. కమలాకరం ఒక రోజు తన నవలని ఇంటికి తీసుకెళ్ళాడు.

నవల పూర్తిగా చదివాక ఎందుకో అనుమానం వేసింది అతనికి. రెండో పేజీలో ప్రచురణ వివరాలు చూశాడు.

"మొదటి ముద్రణ - జనవరి 1972" అని స్పష్టంగా వుంది.

మర్నాడు తను పనిచేసే బ్రాంచ్ ఆఫీస్ లీగల్ ఎడ్వైజర్ దగ్గరకి వెళ్ళాడు కమలాకరం. తన అనుమానాన్ని తెలియచేశాడు.

"మీరు వొప్పుకుంటే లీగల్ నోటీస్ పంపుతాను మీ తరఫున" అన్నాడు ఆయన కమలాకరం చెప్పింది పూర్తిగా విని.

"ఎందుకండీ డబ్బుదండగ. కోర్టుకి కావాల్సింది సాక్ష్యం. అది మనదగ్గర లేదు. నా నవలని మళ్ళీ నాకు రాయల్టీ ఇవ్వకుండా రెండోసారి ప్రచురించారన్న సంగతి రుజువు చేయలేం."

లీగల్ ఎడ్వైజర్ చిన్నగా నవ్వి అన్నాడు.

"మన ప్రయత్నం మనం చేద్దాం. గెలుస్తామనే నమ్మకం నాకుంది"

రెండు రోజుల తర్వాత కమలాకరానికి ఫోన్ చేసాడు లీగల్ ఎడ్వైజర్. సాయంత్రం ఓ సారి ఇంటి దగ్గర కలవమని.

ఆఫీస్‌నుంచి ఇంటికి తిరిగి వెళ్తూ కమలాకరం దారిలో వున్న ఆయన ఇంటికి వెళ్ళాడు.

"మీ పబ్లిషర్ చిరునామా చెప్పండి" అన్నాడాయన.

"దేనికి!" అడిగాడు కమలాకరం.

"దావా,"

"నా నవల గురించేనా!"

"అవును"

"ఎందుకండీ వృథా శ్రమ. గెలుస్తేగా!" చప్పరించేసాడు కమలాకరం.

"మీకెందుకు, ఆ విషయం నేచూసుకొంటాగా."

ఆయన కంఠంలోని నమ్మకాన్ని గుర్తించి అడిగాడు కమలాకరం

"మీకు రుజువులు సాక్ష్యాలు లభించాయా ?"

"సంపాదించాను."

"పాపపరిహారం నవలని రెండోసారి ముద్రించిన ప్రెస్ వాళ్ళెవరో మీకు తెలిసిందా? వాళ్ళు కోర్టుకి వచ్చి మన పక్షం సాక్ష్యం ఇస్తారా?"

తల అడ్డంగా వూపి అన్నాడాయన.

"ఊహు"

"మరి ప్రెస్ సంగతి తెలియకుండా సాక్ష్యం ఎలా సంపాదించారు ?"

"మీ పబ్లిషర్‌కి స్వంత ప్రెస్ వుంది. ఆ ప్రెస్‌లో పనిచేసే వాళ్ళు ఆయనకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వరు."

"మరి ?"

"సంతకం పెట్టండి ఈ నోటీస్ మీద చాలు. మిగతా విషయాలు నాకొదలండి"

కమలాకరం కొద్దిగా అయోమయంగా చూసాడాయనవంక.

చిన్నగా నవ్వారాయన.

"మీ ఫీజ్ ?"

"అయిదువందల రూపాయలు"

కమలాకరం సమాధానం చెప్పబోయేముందు కొద్ది నిముషాలు మౌనంగా ఆలోచించి చెప్పాడు.

"ఐయామ్ సారీ. నాదగ్గరంత డబ్బులేదు."

పకపకా నవ్వాడాయన.

"మీరు నోటీస్ చదవలేదు. మీ అనుమతి లేకుండా మీ నవలని రెండోసారి ప్రచురించినందుకు నష్టపరిహారంగా పదింతలు - అంటే అయిదువేల రూపాయలకి క్లెయిమ్ చేస్తున్నాం."

"ఆల్ రైట్. కానిఇప్పుడు ఎడ్వాన్సుగాఏం ఇవ్వలేను"

"కేసు గెలిస్తే నాకు ఫీజ్ ఇవ్వండి. లేదా కేసుకయ్యే ఖర్చులుకూడా నేనుభరిస్తాను. మీకు పైసా నష్టం వుండదు"

"గెలిస్తే నాకొచ్చే డబ్బులోంచి ఇవ్వాలన్న మాట. థాంక్స్! థాంక్స్ ఏ లాట్"

సంతకం చేసాడు కమలాకరం.

"దీనిమీదకూడా సంతకం చేయండి."

కమలాకరం ఆయనిచ్చిన రెండో కాగితంమీదకూడా సంతకంచేసాడు. తర్వాత అది చదివి అడిగాడు నవ్వి.

"ఫీజ్ ఎగ్గొడతాననే భయంతోనా, మనిద్దరిమధ్యా ఈ ఎగ్రిమెంట్ మీ ఫీజ్ విషయంలో?"

"ఈలైన్ లో వున్నానుకాబట్టి ప్రతిదానికీ ఎగ్రిమెంట్ కాగితంమీద ముఖ్యంఅన్నది నాఅభిప్రాయం."

కమలాకరానికి కొద్దిగా ఆశకలిగింది. తనకి నిజంగా నష్టపరిహారం రావచ్చునీ, తనా కేసులో గెలవచ్చునీ.

*    *    *    *

కోర్టులో కలుసుకున్నారు 'కుముదినీ పబ్లిషర్స్' సంస్థ యజమాని కమలాకరం, వాది ప్రతివాదుల లాయరు చెప్పింది విన్నాడు జడ్జి.

కుముదినీ పబ్లిషర్స్ సంస్థ యజమాని నొక్కి చెప్పాడు. కమలాకరం నవల 'పాపపరిహారం' తను ఒకేసారి ప్రచురించానని అది అయిదు వేల కాపీలేనని రెండోసారి ముద్రించే అవసరం ఇంకా కలగ లేదని.

కమలాకరం తరపు లాయర్‌గా పనిచేసే లీగల్ ఎడ్వైజర్ లేచి జడ్జికి రెండునవలలని అందించాడు.

"యువర్ ఆనర్ అందులో ఒకటి జనవరి 1972లో ముద్రింపబడింది. మరొకటి ఆ సమయంలో ముద్రింపబడిందిగా పేర్కొనబడ్డా, ఆ తర్వాత ముద్రింపబడింది."

"అబద్ధం. రెండూ ఒకేసారి- అంటే జనవరి 1972లో ప్రచురింపబడ్డాయి. ఆ సంగతి ఆ పుస్తకంలోని ప్రచురణ వివరాలు చూస్తే స్పష్టం అవుతుంది." అన్నాడు కుముదినీ పబ్లిషర్స్ సంస్థ యజమానివైపు వాదించే లాయర్.

మైలెర్నెడ్ ఫ్రెండ్ చెప్పేదే అబద్ధం. రెండో పుస్తకం ఇటీవలే ప్రచురింపబడింది."

"ఆ సంగతి నిరూపించే సాక్ష్యంవుందా మీదగ్గర?" అడిగాడు జడ్జి రెండుపుస్తకాలు తెరిచిచూసి.

"ఉంది"

"ప్రవేశపెట్టండి"

"ఆ పుస్తకాల్లోనే వుంది సాక్ష్యం"

ఓసారి కమలాకరంవంక చూసి, చిరునవ్వునవ్వి ఇలా చెప్పాడు అతని లాయర్ జడ్జీతో.

"ప్రత్యక్ష సాక్ష్యం - అంటే ఆ నవలని రెండోసారి ముద్రించడానికి పనిచేసిన కంపోజిటర్స్, ప్రూఫ్‌రీడర్స్, బైండర్స్ మొదలైనవాళ్ళని ప్రవేశపెట్టవలసిన కారణం. వారంతా కుముదినీ పబ్లిషర్స్ యజమాని స్వంతప్రెస్‌లో పనిచేసేవాళ్ళు. యజమానికి వ్యతిరేకంగాసాక్ష్యంఇవ్వరు."

"ప్రత్యక్ష సాక్ష్యం లేకపోతే"

"పరోక్ష సాక్ష్యం వుంది. వివాదస్పదమైన ఆ రెండు ప్రతులూ రెండుసార్లు ప్రచురింపబడ్డాయని నిరూపించడం తేలిక."

ఓసారి కంఠంసర్దుకొని చెప్పాడు కమలాకరం లాయర్ గంభీరంగా.

"ఆ రెండూ రెండుసార్లు ముద్రింపబడ్డాయి. ఎగ్జిబిట్ నంబర్ ఒన్ గా మార్క్ చేయబడ్డ పుస్తకం జనవరి 1972న ముద్రింపబడ్డ అయిదువేల పుస్తకాలలో ఒకటి. బహుశ ఎగ్రిమెంట్ పరిమితిలోనే అవన్నీ అమ్ముడై పోయాయి.

మలిముద్రణకి రచయిత అయిన కమలాకరానికి మళ్ళీ రాయల్టీ ఇవ్వాలి. కేవలం ఆ రాయల్టీని ఎగవేయా

లనే దురుద్దేశంతో రెండోసారికూడా ఈ నవలని ప్రచురించి పుస్తకంలో ప్రచురణకాలం "జనవరి 1972"గా సూచించారు.

అలా రెండోసారి ముద్రింపబడ్డ నవల ఎగ్జిబిట్ నంబర్ రెండుగా మార్క్ చేయబడింది.

"ఇందుకు నిదర్శనం!"

కమలాకరం తరఫున లాయర్ తన నల్లకోటు జేబులోంచి ఓ కాగితం తీసి అందించాడు జడ్జీకి. మళ్ళీ చెప్పసాగాడు.

"రెండోసారి ముద్రించినప్పుడు నవల మొత్తాన్ని మళ్ళీ కంపోజ్ చేసారు. మొదటిసారి ముద్రించిన ప్రతిలో అక్కడక్కడా కొన్ని అచ్చు తప్పులున్నాయి. రెండోసారి ముద్రించిన ప్రతిలో కూడా అచ్చుతప్పులు దొర్లాయి. ఈ రెంటికీ ఎంతమాత్రం పొంతనలేదు. వాటి వివరాలు తెలిపే పట్టిక మీ కిచ్చానిప్పుడు. ఆ పట్టిక సహాయంతో రెండు ప్రతులూ దగ్గరపెట్టుకుని పోల్చి చూస్తే రెండూ రెండుసార్లు ముద్రింపబడ్డాయన్న సంగతి స్పష్టంగా విశదమవుతుంది."

ఆగి ముఖాన్ని రుమాలుతో ఓ సారి తుడుచుకొని మళ్ళీ చెప్పసాగాడు కమలాకరం లాయర్.

"అంతేకాదు. మొదటి ప్రతికివాడిన కాగితం న్యూస్ ప్రింట్ కాగితం. విదేశాల నుంచి దిగుమతి చేయబడ

కాగితం అది. మలిముద్రణకి వాడిన కాగితం మన దేశంలో తయారైన తెల్లకాగితం."

"ఇంకో పాయింట్. మొదటి ప్రతిలో—అంటే ఎగ్జిబిట్ నంబర్ ఒన్‌లో ప్రచురణ వివరాలు తెలుపటానికి వాడిన అచ్చు- అంటే టైప్ -ఫోర్టీన్ పాయింట్. మలి ముద్రణకి అంటే ఎగ్జిబిట్ నంబర్ టూ ప్రతిలో ప్రచురణ వివరాల కోసం వాడిన టైప్ ట్వెల్వ్ పాయింట్."

"మీరు చెప్పింది నిజమే" అన్నాడు జడ్జి రెండు పుస్తకాలనీ అయిదు నిమిషాల సేపు పరిశీలించి, పోల్చి చూసి.

"క్లయింట్ కమలాకరానికి ఈ విధంగా నష్టం కలిగించినందుకు, అతను కోరిన నష్టపరిహారం కుముదినీ పబ్లిషర్స్ యజమాని చేత ఇప్పించి. నా క్లయింటుకి న్యాయం చేకూర్చవలసిందిగా న్యాయస్థానాన్ని కోరుతున్నాను."

కుముదినీ పబ్లిషర్స్ యజమానికి అక్కడికక్కడే చెమటలు పట్టాయి పైన ఫేన్ తిరుగుతున్నా. అతని తరఫున లాయర్ తనింకేం చేయలేనన్నట్లుగా కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం తిరగేయసాగాడు.

కుముదినీ పబ్లిషర్స్ యజమాని మరిమాట్లాడకుండా తన నేరం అంగీకరించాడు.

"ఇతను నేరస్థుడు శిక్షార్హుడు. కమలాకరానికి

అతను కోరిన నష్టపరిహారం చెల్లించాలి లేదా రెండు సంవత్సరాల కారాగారవాస శిక్ష అనుభవించాలి"

"దీన్నిబట్టి చూస్తే కౌముదీ పబ్లిషర్స్ ఎకౌంట్ బుక్స్‌లో కూడా తేడాలుండవచ్చనిపిస్తోంది. ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్ వారు వారి ఎకౌంట్స్‌ని జాగ్రత్తగా తనిఖీ చేయాల్సివుంటుంది. అంతదాకా ఎకౌంట్ బుక్స్, ప్రెస్‌లాగ్‌బుక్స్‌ని పోలీసువారి కస్టడీలో వుంచాలి. ఇంకా...

కమలాకరం సంతోషంగా కరచాలనం చేశాడు. తన లాయర్‌తో. కోర్టునుంచి బయటకు వచ్చాక.

"మార్వలెస్ సర్, యు హేవ్ డనిట్" అన్నాడు.

"కోర్టుద్వారా మీకు డబ్బు వచ్చాకే నా ఫీజ్ ఇద్దురుగాని" అన్నాడాయన సంతోషంగా నవ్వుతూ.

"అయిదువందలు కాదు. వెయ్యి, వెయ్యి రూపాయిలిస్తాను" అన్నాడు కమలాకరం కృతజ్ఞతగా.

"కాని నేను తీసుకోను. నా ఫీజ్ ఐదువందలే" అన్నాడాయన నవ్వి, కమలాకరం చెయ్యి మృదువుగా నొక్కుతూ.

***